# ఆదాయం జాస్తి.. సౌకర్యాలు నాస్తి

వినియోగదారులపై అశ్రద్ధ

రెవెన్యూపై శ్రద్ధ

జెడ్సీ దృష్టి సారించాలని ప్రజల వినతి

సౌకర్యం కేంద్రంలో అన్నీ అసౌకర్యాలే



సర్వర్ డౌన్ కావడంతో రేకుల వేడిలో వేచి ఉన్న వినియోగదారులు



సౌకర్యం కేంద్రం వద్ద రేకుల వేడిలో పన్ను చెల్లిస్తున్న వినియోగదారులు

**కంచరపాలెం:** జోన్–5 జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జోన్‌కు ఆదాయం సమకూర్చేందుకు ఉన్న శ్రద్ధ వినియోగదారులపై లేకపోవడం దారుణమని ఇక్కడి పరిస్థితులు చూస్తే చెప్పొచ్చు. జోన్ 5 పరిధిలో ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాలు వస్తాయి. 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల 24 వార్డులకు సంబంధించిన ఇంటి పన్నులు, కుళాయి పన్నులకు రెవెన్యూ అధికారులు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో ముక్కుపిండి మరీ వసూలు చేశారు. అంత వరకు బాగానే ఉన్నా.. పన్ను చెల్లించే సౌకర్యం కేంద్రం వైపు కన్నెత్తి చూడకపోవడంతో వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

**మలమల మాడుతున్నారు..**

జోన్–5 సౌకర్యం కేంద్రం, సిబ్బంది పార్కింగ్ చోటు ఒకటే కావడంతో వినియోగదారులు పార్కింగు నడుమే క్యూ పాటించి ఇంటి, కుళాయి పన్నులు చెల్లిస్తున్నారు. అసలే వేసవి కాలం పైగా ఉక్కపోత రేకుల షెడ్‌లో కనీసం ఫ్యాన్ల ఏర్పాటు లేకపోవడంతో చెమటకు తడిసి ముద్దవుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వినియోగదారులు వస్తే కేవలం నాలుగే కుర్చీలు ఉండడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు పనులకు వెళ్లిపోతే వృద్ధులు, రిటైరైన వారు పన్నులు చెల్లించడానికి వస్తుంటారు. సర్వర్ డౌన్ అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని వాపోతున్నారు.

**నాడే నయం..**

కూటమి ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీ అంటూ ప్రచారం చేసి ఇంటి పన్నులు, కుళాయి పన్నులు వసూలు చేయించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వడ్డీ 100 శాతం మాఫీ చేసి అసలు వసూలు చేసింది. ఓటు వేసి కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే సరైన బుద్ధి చెప్పారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024లో వడ్డీ పూర్తిగా మాఫీ చేసి రూ.22.45 కోట్లు వసూలు చేస్తే.. 2025లో 50 శాతం వడ్డీ వసూలుతో రూ.27.19 కోట్లు వసూలు చేశారు. వడ్డీ పూర్తిగా రాయితీ ఇచ్చి వసూలు చేసిన దాని కంటే.. 50 శాతం వడ్డీ అమలు చేస్తూ వసూలు చేస్తే వచ్చిన దాని కంటే పెద్దగా వ్యత్యాసం లేని విషయం గమనార్హం. కేవలం రూ.4.74 కోట్ల వ్యత్యాసమే ఉంది. అయినప్పటికీ అధికారులు ఇప్పటి వసూళ్ల గురించి గొప్పగా చెప్పకోవడం కొసమెరుపు.



వసూలు చేసిన పన్నుల చెక్కులను జెడ్సీకి అందిస్తున్న రెవెన్యూ అధికారులు

### అధికారులు స్పందించాలి..

పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ వినియోగదారులపై ఉండాలి. పన్ను చెల్లింపుల సమయంలో నానా ఇబ్బందులు పడుతున్నాం. సర్వర్లు డౌన్ అయితే గంటల సమయం వేచి ఉండే పరిస్థితి వస్తుంది. కూర్చోవడానికి సరైన కుర్చీలుండవు. రేకుల షెడ్ వేడికి ఉండలేకపోతున్నాం. పార్కింగ్ చేసిన వాహనాల వద్దే క్యూ కట్టి పన్ను చెల్లిస్తున్నాం. ఈ సమస్యలపై అధికారులు స్పందించాలి.

– పి. రామకృష్ణారావు, రిటైర్డ్ ఉద్యోగి, కంచరపాలెం

## క్లుప్తంగా

### ఫైరింగ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



ఫైరింగ్‌లో పాల్గొన్న అక్కయ్యపాలెం ఎన్‌సీసీ క్యాడెట్లు

**సీతంపేట:** విజయనగరం కోరుకొండ సైనిక్ స్కూల్లో జరుగుతున్న కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ కనబరిచారు. క్యాంప్‌లో భాగంగా మంగళవారం జరిగిన జూనియర్ వింగ్ ఫైరింగ్ కాంపిటీషన్‌లో చక్కటి ప్రతిభ చూపి రాణించారు. 4వ తేదీన ప్రారంభమైన క్యాంప్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 554 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరు కాగా, వారిలో 106 మందికి ఫైరింగ్ పోటీ నిర్వహించారు. ఒక్కొక్కరికి ఐదు రౌండ్లు చొప్పున ఫైరింగ్ ( 22 డీలక్స్ రైఫిల్) చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు క్యాంప్ కొనసాగింది. క్యాంపు కమాండెంట్ కల్నల్ అజయ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ట్రైనింగ్ క్యాంపులో మేజర్ బ్రహ్మానందరెడ్డి, చీఫ్ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, ఆఫీసర్లు నేతాజీ, జ్యోతి, జయప్రకాష్, శ్యామలరావు, శుక్రరాజ్, మహేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

### యోగసిద్ధాంజనేయుడికి సింధూర అర్చన



ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

**మురళీనగర్:** జాతీయ రహదారి సూర్యానగర్‌లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి సింధూర అర్చన, తమలపాకులతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులచే సామూహికంగా సుందరకాండ పారాయణ చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దర్శనానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సింగమాంబ పండగ



పూజలో పాల్గొన్న నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు చందు

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు పరిధి సింగాలమ్మపురంలో గల సింగమాంబ పండగ ఘనంగా జరిగింది. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు పూజలో పాల్గొన్నారు. ఉదయం నుండి పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పరస, పలు సాంస్కృతిక కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎస్. అమ్మోరు, లక్ష్మణరావు, సీహెచ్ పైడిరాజు, కె.సురేష్, ఆనంద్, ఎ. రాజు తదితరులు ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### ప్రేమ సమాజంలో తనిఖీలు



ప్రేమ సమాజంలో వివిధ విభాగాలను తనిఖీ చేస్తున్న సన్యాసినాయుడు

**విశాఖ–లీగల్:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం దాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రేమ సమాజంలో గల వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సభ్యులను విచారించి, అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గదిని తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### గ్రంథ పఠనంతో చక్కటి నడవడిక



విద్యార్థులతో గ్రంథ పఠనం చేయిస్తున్న విశ్వనాథం, రామారావు

**మురళీనగర్:** మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రిసోర్స్ పర్సన్లుగా వచ్చిన రిటైర్డ్ ఉద్యోగులు విశ్వనాథం, కేవీ రామారావు నీతి కథలను విద్యార్థులతో చదివించి వాటి భావాలను వివరించారు. ఆధ్యాత్మిక పుస్తకాల పఠనం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని కేవీ రామారావు చెప్పారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నవారికి స్థిరమైన భావాలు ఉంటాయన్నారు. పెద్దల పట్ల గౌరవం, సామాజిక సేవా దృక్పథం అలవడతాయని వివరించారు. దశావతారాలపై విశ్వనాథం పిల్లలకు వివరించారు. పిల్లలతో గ్రంథ పఠనం చేయించారు. గ్రంథ పఠనం ద్వారా అన్ని రంగాల్లోనూ రాణించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లలకు క్యారమ్స్ ఆడించారు. వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొన్నారు.

### పేదలకు బియ్యం పంపిణీ

**అల్లిపురం:** పేదలకు 3 కేజీల బియ్యం చొప్పున 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అందజేశారు. ప్రతి నెల చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పేదల ఇళ్లకు వెళ్లి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 25 మంది పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ప్రత్యేక దినాలలో కూడా బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పోరాటానికి డీవైఎఫ్ఐ మద్దతు



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల దీక్షకు మద్దతు తెలుపుతున్న డీవైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షుడు రాజు

**సీతంపేట:** తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వోలు) చేస్తున్న పోరాటానికి మంగళవారం డీవైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీహెచ్‌వోలు చేస్తున్న నిరసన దీక్షలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు ప్రసంగిస్తూ గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను వేధించడం తగదు అన్నారు. వారి న్యాయమైన డిమాండ్లు అయిన ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారి ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, గత ఏడు నెలలుగా బకాయి ఉన్న ఇన్సెంటివ్‌లు చెల్లించాలని, ఈఈఎఫ్‌వో పునరుద్ధరించాలని, ఎఫ్ఆర్ఎస్‌లో మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సంతోష్ కుమార్, ఉమా శైలజ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా 24/7 తాగునీటి పైపులైన్ పనులు



శ్రీనివాసనగర్‌లో జరుగుతున్న 24/7 నీటి సరఫరా పైపులైన్ పనులు

**సీతంపేట:** అమృత్ 2.0 పథకంలో భాగంగా జీవీఎంసీ 43, 44 వార్డుల్లో నీటి ఎద్దడి ఉన్న పలు ప్రాంతాలకు 24/7 తాగునీటి సరఫరాకు పైపులైన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ నుంచి శ్రీనివాసనగర్ మీదుగా నందగిరినగర్ ప్రాంతానికి బల్క్ పైప్ లైన్ వేశారు. ప్రస్తుతం దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, కర్రివానిబ్రిడ్జి ప్రాంతంలో పైపులైన్ పనులు జరుగుతున్నాయి. 43,4 4 వార్డుల్లో శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరేంద్రనగర్, వెంకటేశ్వరకాలనీ ప్రాంత వాసులు వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో తాగినీటి సమస్యను చాలా సంవత్సరాలుగా ఎదుర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో వేసవిలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి ఏషియన్ బ్యాంకు నిధులతో అబిద్ నగర్‌లోని షాదీఖానా కల్యాణ మండపం వద్ద భారీ వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఈ ట్యాంకు నుంచి నీటి ఎద్దడి ప్రాంతాలకు 27/7 తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రస్తుతం ప్రధాన పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరా అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇళ్ల పట్టాల మంజూరుకు డిమాండ్



గోపాలపట్నం తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న వరప్రసాద్ తదితరులు

**మురళీనగర్:** ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని జీవీఎంసీ 50వ వార్డు సాయిరాం నగర్ నివాసితులు కోరారు. ఈ మేరకు వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో గోపాలపట్నం తహసీల్దారు సీహెచ్‌వీ రమేష్‌కు వినతి పత్రం అందించారు.

సాయిరాంనగర్ కొండవాలు ప్రాంతంలో సుమారు 40 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఇంటి పన్ను, విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నామని తెలిపారు. అంతా పేదవారమని, కూలి పనులు చేసుకుంటూ జీవితం గడుపుతున్నామని తెలిపారు. పిల్లల వివాహానికి, అత్యవసర సమయంలో ఇంటిపై బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దారు రమేష్ సానుకూలంగా స్పందించినట్లు వరప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో సాయిరాంనగర్ అధ్యక్షుడు రామారావు, కుర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## వంశీనగర్ గెడ్డ పరిశీలన

- పూడిక, చెత్త తక్షణం తొలగించాలి
- అధికారులను ఆదేశించిన జీవీఎంసీ సీఎంహెచ్‌వో నరేష్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..



సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకుంటున్న జీవీఎంసీ సీఎంహెచ్‌వో నరేష్‌కుమార్

**మర్రిపాలెం:** ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జీవీఎంసీ 50వ వార్డు వంశీనగర్ హైవే పక్కన ఉన్న గెడ్డ పొంగిపోయింది. దీంతో గెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయింది. ఈ విషయమై 'సాక్షి'దినపత్రికలో 'వణుకు పుట్టిస్తున్న వంశీనగర్ గెడ్డ' శీర్షికన కథనం ప్రచురితమవడంతో జీవీఎంసీ సీఎంహెచ్‌వో నరేష్‌కుమార్ స్పందించి మంగళవారం వంశీనగర్‌గెడ్డను పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గెడ్డను యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏఎంహెచ్‌వో సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, జీవీఎంసీ అధికారులు ఆయన వెంట ఉన్నారు

## మాక్ డ్రిల్‌కు మద్దతివ్వండి



మాట్లాడుతున్న ఆడారి కిషోర్ కుమార్

**సీతంపేట:** భారత్, పాక్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణ సమయంలో ప్రతి భారతీయుడు దేశానికి అండగా నిలవాలని కర్షకదేవోభవ జాతీయ అధ్యక్షుడు ఆడారి కిషోర్ కుమార్ అన్నారు. నగరంలో బుధవారం జరగనున్న మాక్ డ్రిల్‌కు మద్దతుగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో స్వచ్ఛంద సంఘాలు, వైద్య విద్యార్థులు, బోధి ధర్మ యుద్ధ కళాక్షేత్రం విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధం గనుక జరిగితే కేవలం నాలుగు గంటల్లోనే భారత్ పాకిస్తాన్‌ను నేలమట్టం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భారతదేశ పౌరులు శాంతికాముకులని, వారికి కోపం వస్తే ప్రపంచ పటంలో పాకిస్తాన్ లేకుండా చేస్తారన్నారు. వైద్యులు జయంతి రమేష్, శ్రీవల్లి, విశాఖ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు పీలా తిలక్, శ్రీదేవి, వెంకటరావు, అక్కెని చిరంజీవిరావు, నర్సింగ్ విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పోర్ట్ పూల్ కలాసీ యూనియన్ ప్రతినిధులు

**డాబాగార్డెన్స్:** 30 ఏళ్లుగా పోర్టునే నమ్ముకున్నాం. తల్లిదండ్రుల వారసత్వ ఉద్యోగాలు, చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తున్నాం. పోర్టు పూల్ కలాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు బేఖాతర్ చేయడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఓడ రేవుల మంత్రి సంతన్ టాకూర్‌ని ఎయిర్‌పోర్టులో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కేంద్ర మంత్రికి విన్నవించుకున్నామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రధానితో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం పోర్టు సెక్రటరీ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పోర్ట్ పూల్ కళాసీ యూనియన్ నాయకుడు వాసుపల్లి రాంబాబు తదితరులు ఉన్నారు.

## మృతుని భార్యకు చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మేయర్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు వామనరావు

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీలో విధులు నిర్వర్తిస్తూ, ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీలో సభ్యుడిగా ఉన్న కిలాని గవరరాజు (హెల్త్ వర్కర్) మృతి చెందాడు. సొసైటీ సభ్యుడిగా ఆయనకు అందాల్సిన చెక్కును మేయర్ పీలా శ్రీనివాస్ చేతుల మీదుగా గవరరాజు భార్య కిలాని వరలక్ష్మికి సొసైటీ అధ్యక్షుడు వీవీ వామనరావు నేతృత్వంలో మంగళవారం రూ.2 లక్షల 83 వేల 826 చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కిలాని గవరరాజు సొసైటీ సభ్యుడు అయినందును సొసైటీలో ఉన్న ఇన్సూరెన్స్ పథకం కింద అతని రుణం పూర్తిగా రద్దు చేయడమే కాక భార్యకు చెక్కు అందజేశామన్నారు. జీవీఎంసీ ఉద్యోగులు కో ఆపరేటివ్ సొసైటీని సక్రమంగా నిర్వహించుకుంటే సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వీవీ వామనరావు, కోశాధికారి బి. తాతారావు, సొసైటీ మేనేజర్ యర్రా ప్రసాదరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలి



సమీక్ష సమావేశంలో నాయకులతో చర్చిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

**సీతంపేట:** వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు మంగళవారం సీతమ్మధారలో గల క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసి పార్టీ తరపున ప్రజలకు అండగా ఉండాలని, అలాగే పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అల్లు శంకరరావు, సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎస్ శశికళ, మాజీ కార్పొరేటర్లు జి.వి రమణి, పామోటి బాబ్జి, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, పీలా వెంకట లక్ష్మి, పి.సునీత, నీలి రవి, దుప్పలపూడి శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.సి.రెడ్డి, మధుకుమార్ తదితరులు

**సీతంపేట:** గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రచించిన శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ కార్యక్రమం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం జరిగింది. ప్రొఫెసర్ కె.సి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ నేటి సమాజానికి అవసరమైన ఆలోచనాపరుడు, తత్వవేత్త అని కొనియాడారు. బాలమోహన్‌దాస్ రచించిన సంకలనంలో విభిన్న రంగాలకు సంబంధించిన విషయాలను కూలంకషంగా పొందుపరిచారని తెలిపారు. రచయిత తన కెరీర్‌లో అనుసరించిన సూత్రాలను ఈ సేకరణలో పొందుపరిచినట్టు తెలిపారు. సభాధ్యక్షుడు, బుల్లయ్య కళాశాల సెక్రటరీ జి. మధుకుమార్ మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ సమాజాన్ని మేధోసంపత్తితో సుసంపన్నం చేసే దిశగా వ్యాసాలను పొందుపరిచి విలువైన సంపుటిగా తీర్చిదిద్దారని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఈ వ్యాసాలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. బొబ్బిలి రాజా కళాశాల మాజీ ఆంగ్ల విభాగాధిపతి వినయభూషణరావు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆండాల్ అమ్మిశెట్టి, డాక్టర్ కె.కుమార్‌రాజా, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో పుస్తకాల అమరికపై అవగాహన



పుస్తకాల అమరికపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

**డాబాగార్డెన్స్:** గ్రంథాలయ వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజు వీధి బాలల శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయంలో పుస్తకాల అమరిక, క్యాట్ లాగ్‌పై గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి అవగాహన కల్పించారు. అలాగే రిసోర్స్‌పర్సన్ పి. యల్లయ్య తెలుగు పద్యాలు నేర్పించారు. అనంతరం పిల్లలచే ఆటలు ఆడించారు. కార్యక్రమంలో 38 మంది పిల్లలు పాల్గొన్నారు.

**కేంద్ర గ్రంథాలయంలో..**

జగదాంబ జంక్షన్ సూర్యాబాగ్‌లో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రాజేంద్ర వర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు